క్లుప్తంగా

వెండి తాపడం తయారీకి రూ.30,116 విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి శుక్రవారం గ్రామానికే చెందిన రామిశెట్టి నాగేశ్వరరావు, రాజేశ్వరి దంపతులు, రామిశెట్టి సాంబశివరావు కుటుంబసభ్యులు రూ.30,116లు అందజేశారు. ఈమేరకు ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా విరాళాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వాహనదారులకు అవగాహన

కంచికచర్ల : రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని స్వర్ణటోల్‌ప్లాజా సేఫ్టీ మేనేజర్ ఉమామహేశ్వరరావు కోరారు. జాతీయ భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలో పలువురు వాహనదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించారు. ఈసందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు, జాగ్రత్తలపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే మాసోత్సవాలలో భాగంగా రోడ్డు రవాణా శాఖ అధికారులతో పాటు తమ ప్లాజా సిబ్బంది పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ఆకుకూరలతో చక్కటి ఆరోగ్యం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చని ముండ్లపాడు అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రామంలోని గర్భవతులు, బాలింతలకు గుడ్లు, పాలు పంపిణీ చేశారు. ఆకుకూరలను ఆహారంగా తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పండించిన ఆకుకూరలను తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి నాగలక్ష్మీ, ఆయా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



మంగొల్లు(వత్సవాయి) : ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. మంగొల్లు గ్రామానికి చెందిన షేక్ కరీంసాహెబ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందాడు. వైద్యఖర్చులు భారీగా అయినందున ఆర్థికసాయం అందించాలని దరఖాస్తు చేసుకోగా, ముఖ్యమంత్రి సహాయ నిధి ఉంచి అతనికి రూ 1,75,582 మంజూరయ్యాయి. ఈ మేరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే రాజగోపాల్ లబ్ధిదారుడికి శుక్రవారం అందజేశారు. గ్రామ పార్టీ నాయకుడు కనపర్తి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛ దివస్ కార్యక్రమం

పెనుగంచిప్రోలు: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా శనివారం మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ టాయిలెట్స్ శానిటేషన్, చెత్తకుప్పలు తొలగింపు, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, స్వచ్ఛత ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో నిర్వహించే ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూచౌక్ నుంచి అమ్మాణీ కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావుకు శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వివిధ వ్యాపారస్తులు రోడ్డుపైకి మెట్లు నిర్మించి, రోడ్డుపైనే షాపుల్లోని సామాన్లు ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారన్నారు. కావున ఆక్రమణలను తొలగించి పాదాచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కమిషనర్‌ను కోరారు.

- ఎన్నికలప్పుడు అర్హులందరికీ పింఛన్లు ఇస్తామన్న కూటమి నాయకులు
- అధికారంలోకి వచ్చి ఏడునెలలైనా.. నేటికీ తెరుచుకోని పింఛన్ల వెబ్‌సైట్
- ఉన్న పింఛన్ల తొలగింపునకు కుట్ర
- సర్వే, వైద్యపరీక్షల నిర్వహణకు సమాయత్తం
- కూటమి ప్రభుత్వ పెద్దల తీరుపై గుర్రుగా జనం

కొత్త పింఛన్లు ఇప్పట్లో లేనట్లే!



కంచికచర్ల గ్రామసచివాలయం(ఫైల్)

కంచికచర్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడునెలలు పూర్తయి ఎనిమిదో నెలలోకి అడుగుపెట్టినప్పటికీ ఇంత వరకు కొత్త పింఛన్లు పంపిణీపై ఎటువంటి కార్యాచరణ రూపొందించలేదు. గతేడాది అక్టోబర్ 1 నుంచే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వ పెద్దలు, ఇంతవరకు రాష్ట్రంలో కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు. కనీసం ఫించన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం నెలల తరబడి ఆశగా ఎదురుచూస్తున్నారు.

పింఛన్ కోసం ఆశగా ఎదురుచూపులు..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా 60ఏళ్లు నిండిన వెంటనే వలంటీర్లు ఇంటికి వచ్చి దరఖాస్తు పూర్తిచేసి సచివాలయంలో అందజేయగానే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు. నందిగామ నియోజకవర్గంలో కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో సుమారు 1700మంది పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ తెరుచుకోకపోవటంతో వారంతా ఆశగా ఎప్పుడు వెబ్‌సైట్ తెరుస్తారా అని ఎదురుచూస్తున్నారు.

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ..

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు తమ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి ఆరా తీస్తున్నారు. నూతన పింఛన్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొత్త పింఛన్లు ఎప్పటినుంచి ఇస్తారనే అంశంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదని ఆయా సచివాలయాల ఉద్యోగులు చెబుతుండటంతో ఇంకెన్నాళ్లు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాలో తెలియడం లేదని పింఛన్ పొందేందుకు అర్హులైన వృద్ధులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల మంజూరు విధానం నిరంతర ప్రక్రియగా కొనసాగిన వైనాన్ని గుర్తుచేసుకుంటూ...ఇప్పుడిలే చేయడమేమిటని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇక కొత్త పింఛన్ల మంజూరు సమాచారం తెలుసుకునేందుకు నిత్యం సచివాలయాలకు వచ్చేవారికి సమాధానం చెప్పలేక సిబ్బంది సైతం సతమతమవుతుండటం గమనార్హం.

పింఛన్లు తొలగింపునకు కుట్ర...

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు ప్రస్తుతం వస్తున్న పింఛన్లలో కొన్నింటిని ఎలాగైనా తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. పింఛన్ లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారంటూ సర్వే పేరుతో వారి పింఛన్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా శుక్రవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ కొత్త పింఛన్ల మంజూరు అంశంపై ఎటువంటి చర్చ జరగని నేపథ్యంలో ఇప్పట్లో కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ లేనట్లేనని ఇప్పటికే పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నవారు ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇకనైనా కూటమి పెద్దలు స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్తపింఛన్లు మంజూరు చేయాలని పింఛన్ దరఖాస్తుదారులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేయాలి



మాడుగుల చిట్టిబాబును అభినందిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామ పార్టీ ప్రధానకార్యదర్శిగా నియమితులైన మాడుగుల చిట్టిబాబు(మార్కు)ను స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అభినందించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలందరిని కలుపుకొనిపోతూ పార్టీ ఐక్యతకు కృషిచేయాలని చిట్టిబాబుకు సూచించారు. కార్యకర్తలకు పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, పార్టీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, గండ్రాయి గ్రామపార్టీ అధ్యక్షుడు దమ్మాలపాటి సత్యనారాయణ, గ్రామ పార్టీ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, బండి రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిల్లి రామారావు, పార్టీ పేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, పార్టీ ఎస్సీసెల్ నాయకుడు శామ్యూల్ కన్నమాల, ఎస్టీసెల్ నాయకుడు బద్దూనాయక్, గొట్టిపాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జామునుండే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

ఆంజనేయులుకు నాయకుల నివాళి



హతుడు ఆంజనేయులుకు నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: హత్యకు గురైన పట్టణంలోని సత్యనారాయణపురంనకు చెందిన దివ్యాంగుడు యర్రంశెట్టి ఆంజనేయులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, న్యాయవాది సత్యశ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పిల్లి రామారావు, నాయకులు శామ్యూల్ కన్నమాల, బద్దూనాయక్, బండి రాజు, మెట్టు ఏడుకొండలు, గొట్టిపాల సురేష్ ఉన్నారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి...

దివ్యాంగుడు యర్రంశెట్టి ఆంజనేయులను అత్యంత పాశవికంగా హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని దివ్యాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆంజనేయులు మృతదేహాన్ని ఆయన సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను కలిసి ఆంజనేయులు కుటుంబానికి తగిన సహాయం చేయాలని కోరారు.

పోలీసుల అదుపులో హంతకుడు?

జగ్గయ్యపేట: పట్టణంలోని సత్యనారాయణపురంలో గురువారం రాత్రి హత్యకు గురైన యర్రంశెట్టి ఆంజనేయులు హత్యకేసులోని నిందితుడిని పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రాత్రి పది గంటల సమయంలో సాయినగర్ కాలనీ నుంచి బయటకు వస్తున్న ఆంజనేయులుపై వెనుక నుంచి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి కత్తితో మెడపై నరికి పరారైన ఉదంతంపై సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడిగా భావిస్తున్న నరేష్ అనేవ్యక్తిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. తనతల్లితో మాట్లాడేందుకు అడ్డుగా ఉన్నాడనే ఉద్దేశంతోనే ఆంజనేయులును నరేష్ హత్యచేసినట్లు ప్రచారం సాగుతోంది. ఆకోణంలో పోలీసులు సైతం తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. మరో రెండురోజుల్లో ఈ దర్యాప్తు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని పోలీసువర్గాలు చెబుతున్నాయి.

సినిమా హాళ్ల తనిఖీ



నందిగామటౌన్: సినిమా టికెట్లకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో బాలకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని సినిమా హాళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు థియేటర్ల యజమానులు నడుచుకోవాలన్నారు. అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కేసు దర్యాప్తునకు ప్రత్యేకాధికారి నియామకం

చందర్లపాడు(నందిగామటౌన్): చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన నల్లాని వీరమణితేజ పోస్టుమార్టం ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించాలని అతని కుటుంబసభ్యులు పట్టుబట్టడంతో శుక్రవారం ఉదయం విజయవాడలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులు, మిత్రుల అశ్రునయనాల నడుమ ముప్పాళ్లలో వీరమణితేజ అంత్యక్రియలు పూర్తయ్యాయి. వీరమణితేజ కేసుకు సంబంధించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు సైతం దర్యాప్తును ముమ్మరం చేయడంతోపాటు హత్యకోణంలోనే విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తునకు వీరులపాడు ఎస్‌ఐ అనిల్‌ను ప్రత్యేకాధికారిగా నియమించడంతో వీరమణితేజ మృతికిముందు అతనితో ఉన్నవారిని, అంబులెన్స్ డ్రైవర్‌ను పోలీసులు వీరులపాడుస్టేషన్‌లో విచారిస్తున్నట్లు సమాచారం. విచారణలో రెండు వాహనాలు ఢీకొనటంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని అంబులెన్స్ డ్రైవర్ పోలీసులకు చెప్పినట్లు సమాచారం. పోస్టుమార్టం రిపోర్టు వస్తే కాని హత్య జరిగిందా? లేదా? అనేది నిర్ధారణ అవుతుందని పోలీసువర్గాలు భావిస్తున్నాయి.

తెల్లదోమ నివారణకు చర్యలు చేపట్టాలి : ఏడీఏ



కొత్తపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ శ్రీనివాస్, ఏఓ విజయ్‌కుమార్

కంచికచర్ల : మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నందిగామ ఏడీఏ బికే శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పలుప్రాంతాల్లో దెబ్బతిన్న పంటల సంరక్షణకు రైతులు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. పత్తిపంటకు తెల్లదోమలు ఆశించకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి పంటకు తెగులు ఆశించకుండా నీలిమందులను పిచకారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కంచికచర్ల మండల వ్యవసాయాధికారి కె.విజయ్ కుమార్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు సాహిత్య, రుచి, రైతులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి అవగాహన



పెనుగంచిప్రోలు: వైద్య సిబ్బంది గ్రామాల్లో కుష్ఠు, క్షయ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీ టిబి జాయింట్ డైరెక్టర్ రమేష్ సూచించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కుష్ఠు, క్షయ వ్యాధులపై వైద్యసిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి ఏ విధంగా వ్యాప్తి చెందుతుంతో కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సదస్సులో జిల్లా లెప్రసీ అధికారిణి ఉషారాణి, వైద్యాధికారిణి సుజిని, సీహెచ్‌వో వెరోనికా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన



పేటలో ప్రయాణికులకు హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తున్న ఎంవీఐ రాజు

జగ్గయ్యపేట అర్బన్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎంవీఎస్ రాజు మాట్లాడుతూ ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సురక్షితమైన ప్రయాణం కోసం, ఆనందకరమైన జీవితం కోసం ద్విచక్రవాహనదారులంతా తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు నడిపే వారు తప్పకుండా సీటుబెల్టు పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఆటోల్లో ఓవర్ లోడ్ ప్రయాణం మంచిదికాదని హెచ్చరించారు. ప్రయాణాల సమయంలో ద్విచక్ర వాహనదారులంతా తగిన ధ్రువీకరణపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయం సిబ్బంది షేక్ ఆలం, శరత్‌చంద్ర, పట్టణ ట్రాఫిక్ పోలీసులు భూపతిరావు, జీవన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి 'రామ్‌కో' చేయూత



కమిటీ సభ్యులకు ఎల్‌ఈడీ లైట్లను అందజేస్తున్న ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామాల అభివృద్ధికి రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యం పూర్తి సహకారం అందిస్తుందని కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. కర్మాగారం దత్తత గ్రామాలైన జయంతిపురం, రావిరాల గ్రామాలకు సీఎస్‌ఆర్ నిధులతో రూ. రెండు లక్షల విలువ చేసే ఎల్‌ఈడీ వీధిలైట్లను శుక్రవారం ఆయా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వీఆర్‌కె మూర్తి, జీఎం ఫరూక్‌మహ్మద్, మైన్స్ జీఎం జాన్‌రెడ్డి, సీనియర్ డీజీఎం రామకృష్ణసాయి, ప్రతినిధులు శివాజీ, రాజాకేశవప్రసాద్, సర్పంచ్ నరసింహారావు, కార్యదర్శి ఇమాంమ్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే చర్యలు తప్పవు



పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న నందిగామ ఎస్‌ఐ అభిమన్యు

నందిగామటౌన్: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ అభిమన్యు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. పెండింగ్ ఉన్న చలానాలను వసూలు చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే చర్యలు తప్పవన్నారు. రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడిపి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. తగిన ధ్రువీకరణపత్రాలు లేకపోవడం, హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు జరిమానా విధించారు.

47 కేసులు నమోదు

కంచికచర్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలో మూడు రోజుల పాటు కోడి పందేలు నిర్వహించిన పలువురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డి.చవాన్ శుక్రవారం తెలిపారు. కంచికచర్ల మండలంలో కోడి పందేలు నిర్వహించిన 20మందిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. చందర్లపాడు మండలంలో 15 కేసులు, నందిగామ మండలంలో 12కేసులు కలిపి మొత్తం 47 కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా మేరీమాత ఊరేగింపు



జగన్నాధపురం(వీరులపాడు): సమస్త జనుల పాప పరిహారార్థం ప్రభువు ఏసుక్రీస్తు శిలువపై రక్తాన్ని చిందించి తిరిగి పునరుద్ధానుడై లేచాడని వరంగల్ మేత్రాసన బిషప్ ఉడుముల బాల పేర్కొన్నారు. మండలంలోని జగన్నాధపురంలో నిత్యసహాయ మాత ఆలయ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం దివ్యబలిపూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన బిడ్డలను రక్షించేందుకే పరలోక మహిమతో భూమిపైకి వచ్చాడన్నారు. ప్రతిఒక్కరు తోటి వారిపై ప్రేమ, దయ, జాలితోపాటు సేవా భావంతో నడుచుకోవాలని సూచించారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరీమాత విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువు సుగుణరావు, సర్పంచ్ బండి విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు బాలస్వామి, నరసింహారెడ్డి, జ్ఞానారెడ్డి, చిన్నపరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయవాడకు చెందిన శ్రీనృత్య కళానిలయానికి చెందిన నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గోనుగుంట శైలశ్రీ పర్యవేక్షణలో చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందచేయడంతో పాటు అమ్మవారి దర్శనం కల్పించారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

నందిగామటౌన్: శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయశాఖ ఏసీ సీతారామయ్య తెలిపారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆలయం ఎదుట ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణదారులతో సమావేశం నిర్వహించి దుకాణాలు ఖాళీ చేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయంలో రూ.1.30కోట్లతో నాలుగు ఉపాలయాల పునరుద్ధరణ, మండపం ఆధునీకరణ, ఫ్లోరింగ్, వంటశాల నిర్మాణం తదితర పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆలయం చుట్టూ సొంతఖర్చుతో ప్రహరీ నిర్మాణం చేపడతామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళి అంగీకారపత్రం అందజేసినట్లు ఏసీ వివరించారు. కార్యక్రమంలో ఈవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.